# ఇది ఆకలి రాజ్యం

—శ్రీమధురజీ

**ఆకలి !**

ఆ...క...లి. కేవలం మూడే మూడు అక్షరాలు. ఆ అక్షరాల వెనక అనంతమైన శక్తి. యుగ యుగాలుగా మానవుని నడిపించిన అంతులేని శక్తి. తరతరాలుగా మనిషిని శాసిస్తున్న అద్భుతమైన శక్తి.

తిరుగులేనిది తరిగిపోనిది అనంతమైనది అజేయమైనది.

ఆకలి...ఆకలి...

దీనికి కులం లేదు. మతం లేదు. జాతి లేదు. దేశం లేదు. కాలం లేదు.

ఇది సార్వకాలికం. సార్వ వ్యాపితం.

అవును మనిషి పురోగతికీ, మనిషి అధోగతికీ దోహదం చేసింది ఒక్కటే.

మనిషిని మహనీయుని చేసిందీ, దానవుని చేసిందీ ఒక్కటే.

అదే ఆకలి...ఆకలి...ఆ. క. లి.

• • • •

తూరుపు కొండమీదకు రెండుబారలుగా పైకెగ బాకిన సూర్యుడు తన తీక్ష్ణ కిరణాలతో ప్రపంచాన్ని సూటిగా గుచ్చుతున్న వేళ...

దుమ్ము. దుమ్ము. దుమ్ము.

దుమ్ములో పశువులు. దుమ్ములో ఆవులు. అదే దుమ్ములో పశువులు కాచే పదేండ్లు నిండని పిల్లలు. వాళ్ళ నల్లని ఒంటిమీద ఎర్రెర్రని దుమ్ము ఒంటిమీద చొక్కాలు లేవు, చిరుగుల నిక్కర్లు తప్ప. దుమ్ముతో రేగిన వెంట్రుకలూ, పీక్కుపోయినమొహాలూ ఎండినరొమ్ములూ, లోతుకు పోయిన కళ్ళూ. ఆ పిల్లలు ఎవ్వరూ ఆరోగ్యంగాలేరు. ఆనందంగా లేరు. ఆకర్షణీయంగా లేరు.

వాళ్ళెవరికీ భవిష్యత్తు లేదు, అతుకుల గతుకుల వర్తమానం తప్ప. వారందరికీ సమృద్ధిగా ఉన్నది ఒక్కటే. అది ఆ. క. లి.

సన్నిగాడు, బుచ్చోడు, గుండుగాడు, సీనుగాడు, బాలిగాడు, బోడోడు, రామిగాడు,బుచ్చిగాడు—కనీసం పేర్లయినా ఆకర్షణీయంగా లేవు.

పశువుల మందలు కాలువ గట్టు వైపు తిరిగాయి మరింత దుమ్ము లేపుతూ.

ఆ మందల్లో అన్ని పశువులు, ఆవులు ఉన్నా వాటిని కాచే ఆ పిల్లల్లో ఎవ్వరికీ సొంత పశువులు లేవు, వారి తలిదండ్రులు అహోరాత్రులూ పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా ఎవ్వరికీ సొంత పొలాలు లేనట్లు.

పలకలు పట్టవలసిన పదేళ్ళ వయసులో పేడ తట్టలు పట్టాయి వాళ్ళ చేతులు.

బలపం పట్టవలసిన లేత వేళ్ళు బర్రె నదిలించే ములుగర్రలు పట్టాయి.

పదేళ్ళ నేతపని పసి కూనల్ని ఆకలి పశువుల మందల్లో, పేటతట్టల్లో పడేదాకా తరిమి తరిమి కొట్టింది.

మధ్యాహ్నమయింది. అది ఆకలి వేళ.

పిల్లలు తమ కాముందులు కట్టిన చద్ది మూటలు విప్పుకున్నారు.

"ఏం...దీనమ్మ. ఊరా బువ్వ రేత్తిరిదిరా"

బోడోడు అన్నం గెలుకుతున్నాడు. పారేయాలని ఉన్నా పారేయటానికి ఆకలి అడ్డం వచ్చింది.

"మా రెడ్డమ్మ మరీ వాల్గ ముద్దల్నే కట్టేనాది చూడ్రా" బాలిగాడు.

"మనాకలి ఆళ్ళ కేటి తెలుత్తాదిరా. ఆళ్ళు మారాజులు..." సీనుగాడు.

"అరే—విన్నట్లాగే అందరం కలిపేసుక తిందాం పట్టండి" సిన్నయ్య సలహా ఇచ్చాడు.

"గట్లానే. గట్లానే" అన్ని సద్దులూ కలిశాయి.

ఎవ్వరి కడుపులోనూ ఆకలి పూర్తిగా చల్లారలేదు. నీళ్ళతో కాస్తంత ఉపశమించింది.

"ఒరే, రామిగా. నీ కో సంగతి తెలిసిందట్రా"

"ఏట్రా."

"మనూరి బల్లో మద్దినాల బువ్వెడుతున్నరట గదా."

"నీ మొగం బల్లో బువ్వేందిరా?"

"బువ్వేరా నీ యవ్వ రెడ్డిగోరుకూడా సెప్పినారు పెతిదినం మద్దినాల బల్లో బువ్వెడతరట"

"పెతిదినమా! ఇది మరీ సిత్రం గుండే కడుపు నిండా పెడతరటవా?"

"రెడ్డోరు కాదు గద ఆళ్ళు గవరమెంటోళ్ళు కదా కడుపు నిండెడతరులే."

"గట్లయితే నేనూ రేపటి నుంచి బల్లో కెలతా"

"వోరే రామిగా! మద్దినాల ఆళ్ళు బల్లో పెడతరు కాని పొద్దుటాల, రేత్తిరేల నీకు తిండెవడెడతరురా గొడ్లు కాయకుండా బల్లో కెలితే."

ఆ ప్రశ్నతో కొన్ని క్షణాలు భయంకర నిశ్శబ్దం.

రామిగాడు మరి మాట్లాడలేదు.రామిగాడికీఅమ్మ, నాన్న ఉన్నారు. కానీ వాళ్ళ రెక్కల కష్టం వాళ్ళకూ మరి నలుగురు చిన్న పిల్లలకూ చాలటం లేదు. అందుకే కేవలం వాల్గ మెతుకుల కోసం పదేళ్ళు నిండని రామిగాడు రెడ్డిగారింట్లో పశువుల కాపరయ్యాడు.

చింతచెట్టు మొదల్నానుకుని కూర్చున్న సిన్నయ్య ఏ మాటా మాట్లాడకుండా మౌనంగా వాళ్ళ మాటలు వింటున్నాడు.

ఎండిన సిన్నయ్య కన్నుల్లో ఆ మాటలు కొత్త వెలుగుల్ని నింపాయి.

సిన్నయ్య చిన్నారి మనసులో ఒక కొత్త ఆలోచన మొదలయింది.

• • • •

చెళ్. చెళ్. చెళ్.

సిన్నయ్య చెంపలు వినురుగా వాయిస్తున్నాడు వెంకటి.

"ఓలమ్మో. అయ్య నను సంపేత్తున్నాడు సూడవే. ఆఁ. ఆఁ. ఆఁ."

"ఏందయ్యా. నువు మడిసివా పశువ్వా. పిలగాన్ని గొడ్డు బాదినట్లు బాదుతున్నవ్. ఏటి సేసిండు ."

"ఏటి సేసిండో అడుగే అన్నే నీముద్దు ల్కొడుకు దొంగ గొడ్డెల్లే ఉన్నాడు గంద అడుగూ."

"ఏందిర సిన్నా. యేటి తప్పు సేసినవు"

"రెడ్డిగోరి గొడ్ల సాకిటి కెళ్ళనంటే." తండ్రి

వైపు భయంగా చూశాడు చిన్నయ్య.

"ఈ దొరోరి బిడ్డ. ఒరయ్యా! నే వింక గొడ్లు కాయను గాక కాయను. దరిజాగా బల్లో కెల్లి సదూకుంటావయ్యా. సదిగి సదిగి కలికిటోరు సవుతా నయ్యావని నీలుగు తున్నడు."

ఆమె చిన్నయ్య కేసి విస్మయంగా చూచిందికొడుకు కోరరాని కోరిక కోరినందుకు.

"అది కాదమ్మా ... మద్దినాల బల్లో పిలగాండ్ల కందర్కీ కడుపునిండా బువ్వెడుతున్నారటవే ... అందుకే నానూ బల్లో కెల్లి సదూకుంట."

"బల్లో బువ్వ పెట్టేదేందిరా, సిన్నా ... సాల సిత్రం గుంది." ముత్తెమ్మ ఆశ్చర్యపోయింది.

"అద్దరేవే ... ఆళ్ళు మద్దినాల పెడితే పెడతరు. పొద్దుటాల, రేత్తిరేల యీడి కడుపుకు తిండెట్టే నా కొడుకెవడే?"

ముత్తెమ్మకు మొగుడి మాటలూ నిజమేనని పించాయి. తనూ, తన మొగుడూ తెస్తున్న కూలి గింజలూ, వేస్తున్న పశువుల పేడ తమకూ చిన్న పిల్లలకే కడుపులు నింపటంలా ... మరిక సిన్నయ్య కూడా పెద్ద రెడ్డి దగ్గర పని వదిలేస్తే ... వాడికీ పొద్దునా, రాత్రీ ఇందులో నుండీ తిండి పెట్ట వలసి వస్తుంది.

రెండేళ్ళ క్రిందటనే బల్లో చేరిన చిన్నయ్య నెలకోసారి, రెండుసార్లా— పనీ పాటా లేనపుడు, జోరున వానలు కురిసి గొడ్లు బయట కెల్ల లేనపుడు మూలలో దాచుకున్న బోడి పలక తీసేవాడు బడికోసం— తమ వాడలో ఉన్న తెల్ల బట్టల సుందర్రావుని చూసినపుడు — ఆ చిన్ని మనసులో చదువుకోవాలన్న కోరిక ప్రబల మయ్యేది. కాని చిన్నయ్య స్కూలు జీవితం అక్షరమాల లోని అచ్చుల తోనే ముగిసింది. ఇపుడు మళ్ళీ ఇన్నేళ్ళకు మధ్యాహ్న భోజన పథకం నిండు మనసుతో స్వాగతం పలుకుతోంది.

వెంకటి కుక్కి మంచంలో కూచుని బీడి ముట్టించుకున్నాడు.

"ఏరో, సిన్నిగా ... రెడ్డిగోరి పన్లోకి పోయే దుందా— లేదురా—" వెంకటి కంఠం ఖంగున మోగింది. ముత్తెమ్మ, చిన్నయ్య ఆ అరుపుకు ఉలికిపడ్డారు.

ముత్తెమ్మ మనసులో హఠాత్తుగా నో ఆలోచన మెరిసింది.

చిన్నయ్య కళ్ళు పైట చెంగుతో తుడిచింది. చిన్నయ్య భయం భయంగా తల్లి కొంగుచాటున దాక్కున్నాడు.

"ఇగో నేనో మాట సెబుతాను ... కుసింత ఇనుకుంటావా—" బతిమాలుతున్నట్లుగా అడిగింది ముత్తెమ్మ.

"ఇనుకుంట లేయే ... సప్పున సెప్పు."

"పిలగాడు బల్లో కెడతానని మోజుపడుతున్నడు."

"ఇంగేం బల్లో యేసిరా ... మరింక బడిడిసి నాక అన్ని వూల్లో కెల్లి నాలుగిల్లు అడుక్కు తెచ్చుకుని తిననుము ...థూ —" కాండ్రించాడు వెంకటి.

"అడుక్కు తింటానికి ఆడికేం కర్మం బట్టల ... నే సెప్పేది కుసిం తిను ... పొద్దుటాల రెడ్డిగోరి గొడ్ల సావిట్ల పేడకల్లు తీసి, కుములు సిమ్మి, గొడ్లకు నీల్లు మోసి, కలానికెల్లి ఆటికి మేపుల్దెచ్చి పడేసి— ఆళ్ళు పెట్టిందే తిని అట్నుంచటే బల్లో కెలతాడు. మరింక మద్దినాల ఆళ్ళే బల్లో కడుపు నిండగ పెడతారు గామట్టి — రేత్తిరికి నా గిన్నెలోదే



ఆడికీ వాళ్ళ ముద్దలెడతా — ఇగో సువ్వూరికే నిప్పుతొక్కిన కోతివాగ యెగిరెగిరి పడక కుసింత నా మాట యినుకో—పిలగాడికి సదువుకు సదువూ వత్తాది — బువ్వకు బువ్వా జరుగుతది.''

ముత్తెమ్మ చెప్పింది సరిగానే విన్నాడు వెంకటి. ఈ పద్ధతి వెంకటి క్కూడా నచ్చింది. కొడుకు చదువుకోవాలని వెంకటికి మాత్రం లేదా? ఎందు కుండదు? వెంకటి మాత్రం తండ్రికాడా? కానీ ఆకలి ఆశల పీకల నొక్కి వాస్తవాన్ని పలికిస్తోంది.

''ఏటంటవు?''

''నీ మాట కేటంటనే, ముత్తెం ... గమ్మున సరేనంట.''

సిన్నయ్య మనసులో ఒక్కసారిగా కోటి కోర్కెలు పరవశించాయి. కళ్ళు ఆనందంతో మిలమిలా మెరి శాయి. తన ఆనందాన్ని మనసులో ఇముడ్చుకోలేక మిత్రులతో పంచుకోటానికి తూనీగలా పరుగు తీశాడు.

ఆ వారంలో హరిజన వాడలో ఇలాటి సన్ని వేశాలు చాల ఇళ్ళలో జరిగాయి. కానీ — అన్నిటి ముగింపూ ఒకటి మాత్రం కాదు.

• • •

ఉదయం తొమ్మిది గంటలు.

బడి గంట గణగణా మ్రోగింది పిల్లలకు స్వాగతం పలుకుతూ.

ఎప్పుడో కట్టించిన ఆ బడి గోడలు రంగు మాసి— తగిన సంస్కారం లేక మట్టికొట్టుకు పోయిన బీద పిల్లల ముఖాల్లా కళా విహీనంగా ఉన్నాయి. ఒక ప్రక్క పడిపోయిన ప్రహరీగోడ — విరిగిన మధ్య తరగతి బడిపంతుళ్ళ జీవితంలా ఉంది.

వూరు పెరిగినందుకు పిల్లలు పెరిగి— వసతి చాలక బడి వెనుక ఖాళీస్థలంలో ఈతాకుల గుడిసెలు ఒక ప్రక్కకు ఒరిగి కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి—విద్యా రంగంలో తరిగిపోతున్న నైతిక విలువల్లా. మొత్తంగా ఆ బడి స్వరూపం శిథిల మవుతున్న మన విద్యా వ్యవస్థకు ప్రతిబింబంగా ఉంది.

ఒకటవ తరగతి గది...

గదంతా చిందరవందరగా ఉంది. కాళ్ళు విరిగిన పలక బెంచీలు పిల్లలకూ, చేతులు విరిగిన కుర్చీలు పంతులుకూ వేసి ఉన్నాయి. ఎప్పుడో రంగు వెలసిన గాంధీ గారి బోసినవ్వుల బొమ్మ మాసిపోయిన ఆ గోడకు అలంకారంగా మాత్రం లేదు. ఫ్రేము విరిగిన నెహ్రూగారి బొమ్మ — గాంధీగారికేసి బడి గది కేసి ప్రశ్నార్థకంగా చూస్తూ ఉంది.

సిన్నయ్య కట్లు విరిగిన తన లోడి పలకను పలక బెంచీ క్రింద జాగ్రత్తగా దాచుకున్నాడు. సిన్నయ్యతోపాటు ఆ రోజు మళ్ళీ బడికొచ్చినవాళ్ళలో బోడిగా డనబడే బోడయ్య, రామిగాడనబడే రామన్న, పీసుగా డనబడే జానయ్య ఉన్నారు. మిత్రులు నలు గురూ తరగతి గదిలో ఒక వారగా, మూలగా నున్న నేల బెంచీపై కూర్చున్నారు. చాలా రోజుల తర్వాత— రోజు లేమిటి — నెలల తర్వాత బళ్ళోకి మళ్ళీ అడుగు పెట్టిన వారికి బడి వాతావరణం క్రొత్తగా, వింతగా, అదో మాదిరిగా భయం గొలిపేదిగా ఉంది. మిగిలిన పిల్లలంతా క్రొత్తగా మళ్ళీ బడికొచ్చిన ఈ నలుగురినీ వింతగా, ఆసక్తిగా, ఉత్సాహంగా గమని స్తున్నారు. పైగా ఆ ఒకటవ తరగతిలో అంతా దాదాపు ఐదారేళ్ళ వయసువారే. సిన్నయ్య బృందానికి మాత్రం పదేళ్ళకు ఎవరికీ తక్కువలేదు. ఆ వయసుల తేడా చిన్నపిల్లలకి ఆశ్చర్యంగా ఉంటే— వీరికి మాత్రం సంకోచంగా, సిగ్గుగా ఉంది.

పంతులుగారు వచ్చారు.

నలభై ఐదేళ్ళు దాటిన పంతులుగారు ఎందుకో ధుమధుమ లాడుతూ తరగతి గదిలోకి వచ్చారు. మాస్టారిని చూచిన వెంటనే అనుకోకుండా సిన్నయ్య గుండెలు గుబగుబ లాడాయి. వస్తూనే అల్లరి చేస్తున్న నలుగురి చిన్నపిల్లల్ని తన చేతిలో నున్న ఈత బెత్తంతో వీపులమీద బాదాడు.

''సైలెన్స్!'' కంఠం ఫిరంగిలా మోగింది.

పిల్లలు భయంతో వూపిరి బిగబట్టారు. క్షణంలో నిశ్శబ్దం రాజ్యం చేసింది. అప్పుడు పంతులుగారి గుబురుమీసాల వెనక గర్వం, సంతోషం క్షణకాలం మెరిశాయి. అనుకోకుండా మీసం సవరించుకున్నాడు. పంతులుగారి మీసం చూస్తుంటే సిన్నయ్యకు మళ్ళీ ఎందుకో భయం వేసింది.

''నిన్న చెప్పిన అ ఆ లు రాయండ్రా. తప్పు రాస్తే వీపు చీరేస్తా — వూ— రాయండి.'' మళ్ళీ గర్జించాడు.




తల వెంట్రుకలు రాలుటకు కారణము పేలు

పేలను, ఈరులను నశింపజేయుటకు కెన్జ్ వాడండి. సువాసనతోకూడిన పేలనాశిని కెన్జ్ హెయిర్ ఆయిల్‌ను వాడి మీ కేశములను కాపాడుకొనండి.

కెన్జ్

పేలనాశిని మందు

దీనిలో ఈరులను నశింపజేయు బెన్‌జోకెయిన్ ఉన్నది.

నిర్భయముగా వాడుటకు వీలైనది.




PHARM PRODUCTS

ఫార్మ్ ప్రోడక్ట్స్

తంజావూరు-613 007 తమిళనాడు

అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.

Chhaya/PP/222

పణికే చేతులతో పిల్లలు బెంచీల కిందనున్న పలకలు తీసి భయం భయంగా వంకర టింకరగా అక్షరాలు వ్రాయటం ప్రారంభించారు— తలలు మోకాళ్ళ సందుకు కుదించుకుని.

సరిగ్గా అప్పుడు చూశారు సిన్నయ్య బృందాన్ని పంతులుగారు.

"అరెరే... నే సరిగా గమనించ లేదు. మన తరగతి లోకి నాలుగు గాడిదలు కూడా వచ్చాయే."

తలలు వంచుకుని వ్రాస్తున్న పిల్లలంతా ఆశ్చర్యంతో తలెత్తారు— బళ్ళోకి గాడిదలు రావట మేమిటా అని.

"గాడిదలంటే ఆ గాడిదలు కావ్రా. అదిగో ఆ నలుగురూ అడ్డగాడదల్లా పెరిగి ఇప్పుడు సిగ్గూ, శరమూ లేకుండా చిన్న పిల్లలతో కలిసి ఒకటవ తరగతి కొచ్చారు వెధవలు. లేవండ్రా—గాడిదలూ— లేవండి."

నలుగురూ భయం భయంగా సిగ్గుతో చచ్చిపోతూ లేచి నిలబడ్డారు, తలలు నేల కేసికొని. సిన్నయ్యలో భయం మరీ ఎక్కువ అయింది. కాళ్ళు వణుకుతున్నాయి.

"ఏమ్రా... ఇన్నాళ్ళు బడికి రాకుండా బయట గాడిదలు కాస్తున్నారా?" ఎవ్వరూ మాట్లాడ లేదు భయంతో.

"మిమ్మల్నేరా— వెధవల్లారా. పలకరేం—బెల్లం కొట్టిన రాళ్ళలాగా."

"గా... గా... గాడిద... ల్ని... కాద్సార్."

"మరి?"

"బ...బర్రెల్ని..." రామిగాడు గొంతు పెగుల్చుకుని చిన్నగా అన్నాడు.

అంతే!

పంతులుగారు పడి పడి నవ్వారు. పిల్లలంతా ఒక్కసారిగా ఆ నవ్వుతో శ్రుతి కలిపారు. సిన్నయ్య బృందానికి నేలలోకి కుంచించుకు పోతున్నట్లుగా ఉంది ఆ పరిస్థితి. బోడయ్యకు కళ్ళలో నీళ్ళుకూడా తిరిగాయి.


"మరిప్పుడా బర్రెల్ని ఎవడు కాస్తాడ్రా— మీ నాయనా?" వ్యంగ్యం.

ఎవ్వరూ బదులు పలకలేదు.

"ఇక్కడ బళ్ళో తిండెడుతున్నారని తెలిసి విస్తళ్ళ మీది కెగబడుతున్న కుక్కల్లాగ బళ్ళమీది కెగబడుతున్నారు వెధవ మూక. చదువు కోవాలన్న శ్రద్ధ తగలడి ఉంటే మరిన్నాళ్ళూ బళ్ళోకి చావలేదేం? అబ్బే! చదువెందుకు తిండి కావాలి కాని. తిండి. సిట్‌డౌన్!" మళ్ళీ గర్జించాడు.

నలుగురూ బిక్క చచ్చి కళ్ళ నీళ్ళు పెట్టుకుని దిగులుగా, దీనంగా కూర్చున్నారు.

చదువు ఉండి, సంస్కారం లేని ఇలాటి ఉపాధ్యాయులు అక్కడక్కడ ఉంటారు. వీరికి పసిపిల్లల లేత మనసులతో ఆడుకోవడం హాబీ. వారిని మానసికంగా, భౌతికంగా హింసించటం వీరికి ఆనందాన్నిచ్చే అలవాటు. కలిమి గలవాళ్ళ పిల్లల్ని నెత్తి కెక్కించుకోవటం, లేమి నీడన బతికే నిర్భాగ్యపు పిల్లల్ని కాల బెట్టి నేల రాయటం వీరికి సహజం.




అది పసిపిల్లల పాలిటి శాపం!

పది నిమిషాల తర్వాత మళ్ళీ సిన్నయ్యను లేపి మాసి, చిరుగులు పడ్డ వాడి గుడ్డల్ని, తైల సంస్కారం లేని వాడి జుట్టును, వాడికి చదువు చెప్పించని వాడి తల్లి తండ్రులను చెడా మడా తిట్టి, వాడి బోడి పలక మీద నిర్లక్ష్యంగా ఆ అలు వ్రాసిచ్చి తలెత్త కుండా దిద్దమన్నాడు.

ఆదరించి ఆప్యాయతలు కురిపించవలసిన ఉపాధ్యాయులే కసిరి కసిరి ఈసడించుకుంటే, ముందే సగం చచ్చి భయం భయంగా బళ్ళోకి అడుగు పెట్టిన ఆ పసిపిల్లల అమాయక హృదయాలు ఎంతగా అల్లాడి పోగలవో కదా!

"నీళ్ళు మోసే సుబ్బన్న ఇవ్వాళ పనిలోకిరాలేదు— మీ తరగతి నుంచికూడా ఎవరినయినా పంపండి, సార్." రెండవ తరగతి పంతులు అడిగాడు.

"ఒక్కరేంటి, సార్! ఇవ్వాళ నా క్లాసులో నలుగురు 'పెద్దమనుషులు' చేరారు. బంగారంలా ఉపయోగించుకోండి. ఒరేయ్... మీ రెళ్ళి కడవల్ని తీసుకు కాలువ కెళ్ళి, ఇవాల్టికి కావలసిన నీళ్ళు తీసుకు రండి. ఊ— వెళ్ళండి." గుడ్లురిమి గర్జించాడు సిన్నయ్య బృందా న్నుద్దేశించి.

సిన్నయ్య బృందం లేచి మెల్లిగా బడి వెనక్కు వచ్చారు. వెనుక వైపునున్న కానుగచెట్టు పక్కన ఖాళీ స్థలంలో పొయ్యి పెట్టి వంట ప్రారంభించారు. నలుగురు పిల్లలు బియ్యం, బేడలలో రాళ్ళేరుతున్నారు. బియ్యం, బేడలలో అదే రంగు, సైజులలో 'కళాత్మకంగా చేసిన కల్తీని' కనుక్కోలేక పిల్లలు సతమత మవుతున్నారు. మరో ఇద్దరు మిరపకాయలకు తొడిమలు తీస్తూ, ఉల్లిపాయ ముక్కలు తరుగుతున్నారు.

ముగ్గురు పిల్లలా మూల పొయ్యి కిందకి ఎండుపుల్లలు, వంట చెరుకు సిద్ధం చేస్తున్నారు. మరో ఇద్దరు ఆ నాటి వంట మనిషిగా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రెండవ తరగతి పంతులుగారికి అవీ ఇవీ అందిస్తున్నారు చకచకా. ఆ వంట దృశ్యాన్ని నోళ్ళు వెళ్ళబెట్టుకు చూస్తున్న సిన్నయ్య బృందంతో

"అలా నోళ్ళు తెరుచుకు చోద్యం చూస్తున్నార్రా వెధవల్లారా. ఆ మూల నున్న ఆ కడవలు తీసుకుని కాలవకు తగలడి నీళ్ళు తీసుకు రండి. ఆ అంట్ల వెధవ సుబ్బన్నగా డీ వేళ చావలేదు. ఊ—త్వరగా రండి. ఇహ ఇక్కడ గంట కొట్టీ కొట్టంగానే కడుపులు బాదుకుంటూ ఆవురావురుమంటూ పిల్ల మూక కాకుల్లా మూగుతారు. ఊఁ ఊఁ. కదలండ్రా గాడిదల్లారా."

సిన్నయ్య బృందం కడవలతో కదిలింది. కాలువ బడికి దగ్గరగా మాత్రం లేదు. తక్కువ తక్కువన్నా రెండు ఫర్లాంగు లుంటుంది. వంటా వార్పులకు, పిల్లలకు తాగటానికి, ఆ పైన పళ్ళేలు, పాత్రలు శుభ్రం చేసుకోవటానికి కనీసం ఒక్కొక్కరు ఏడెనిమిది కడవ లైనా మోయక తప్పదు.

నలుగురూ మౌనంగా నడుస్తున్నారు. ఎవ్వరికీ మనసులో ఉత్సాహంగా లేదు. కొత్తగా మళ్ళీ బడికి వచ్చామని కాని, చదువుకుంటున్నామని కాని, నలుగురితో కలిసి సరదాగా ఉండొచ్చునని కాని ఎవ్వరికీ ఆనందంగా లేదు.

కుంటుతున్న కాలిమీద కర్రతో మోదినట్లుగా ఉంది పంతులుగారి ప్రవర్తన.


మండుతున్న గాయాన్ని కెలికినట్లుగా ఉంది మాస్టర్ల 'అపూర్వ ఆదరణ'.

"నా కెందుకో ఈ బడి నచ్చలేదు రారే. కాలవ గట్టంట గొడ్లను కాసుకోటమే పానానికి సుకంగా ఉండేది."

"ఆ పంతులేటి మన ల్నిట్టా మాటి మాటికీ గాడిదలని తిడ్తరు. అప్పు డప్పుడూ తిట్టినా మా రెడ్డిగోరే నయం."

"మన సన్నిగానికి నచ్చినట్టుండాది బడి. కదురా, సన్నగా."

సిన్నయ్య మాట్లాడకుండా కాలవలోకి దిగి నీళ్ళు ముంచుకుని, కడవ భుజాన పెట్టుకుని




మెల్లి మెల్లిగా గబ్బెక్కాడు.

కడవ తగిలీ తగలంగానే భుజం 'చురుక్కు'మంది. పొద్దుట్నుండి పెద్ద రెడ్డిగారి గొడ్లకు నీళ్ళు మోసీ మోసీ భుజం మంట పెడుతూంది.

తొమ్మిది గంటలకే బడికి పోవాలన్న ఉత్సాహంతో మలి కోడి కూతకే లేచి కూచున్నాడు సిన్నయ్య.

"ఏరా, సిన్నా, అప్పుడే లెగిసినావు. సీకటింకా తావా ఉంది—పడుకో."

"అది కాదేమ్మా. రెడ్డిగోరింట పేడకసులు పొద్దు గలగ తీసి, గొడ్లకు నీల్లు పోసి, తొమ్మిది గంటల్కే బల్లో కెల్లాల గదే. మరందుకే..."

"మా నాయనే. పన్జేసుకుంటూ సక్కంగ సదూ కోరా." ఆ తల్లి చల్లని మనసు కొడుకుని ఆశీర్వదించింది.

హరిజనవాడ నుండి రెండు పరుగుల్లో రెడ్డిగారి పశువుల పాక దగ్గర కొచ్చి పడ్డాడు. సిన్నయ్యకు మహోత్సాహంగా ఉంది. గబగబా పేడను పోగుచేసి గంపలకెత్తి దిబ్బలో వేసి వచ్చాడు. పాకను కంది పిడితో శుభ్రంగా చిమ్మాడు. కల్లాని కెళ్ళి రెండు మోపులు గడ్డి చొప్ప తీసుకు వచ్చి పశువుల ముందట పడేశాడు. బావి దగ్గిరి కెళ్ళి దాదాపు పది కడవలు నీళ్ళు మోసి పాకలోని తొట్లు నింపాడు.

"ఏరా, సిన్నిగా. మరీ పొద్దున్నే వచ్చావ్?"

"ఇయ్యాల బల్లో కెలుతున్నా గంద, రెడ్డి." ఉత్సాహంగా జవాబిచ్చాడు.

"హోర్నీ —నీకెందుకురా బడీ గిడీ—కమ్మంగా గొడ్లు కాచుకోక."

సిన్నయ్య బదు లివ్వలేదు.

మళ్ళీ రెడ్డిగారే అన్నారు నవ్వుతూ. "అవున్లే— గవర్నమెంటోడు డబ్బు లెక్కువై మద్యాన్నం బల్లో పిల్లలకు తిండెడుతున్నారటకదా. అయితే మరా లెక్కన పెతి యెదవా బల్లో కెడితే మా గొడ్ల కాచే పిల్లగాళ్లెక్కడ దొరుకుతరు మరి? ఆఁ! ఈ తిండెట్టడం ఎన్నాల్లుంటదిలే మూన్నాల్ల ముచ్చట."

సరిగ్గా అప్పుడే రెడ్డమ్మ కేకేసింది.

"పెదజీతగాడు రంగడికి జొరమట. రాలేడట. సిన్నిగాన్ని ఎద్దుల పాకలో నాలుగ్గడవల నీల్లు పోయ మన్జెప్పు."

"సీ రెడ్డమ్మ గొంతు ఇనపడుతుందటరా, సిన్నిగా. ఎద్దుల పాకలో నాలుగ్గడవల నీల్లట పొయ్యరా."

సిన్నయ్య గుండెలో రాయి పడింది. ఆ ఎద్దులకు నాలుగు కడవలు ఏ మూలం? కనీసం మళ్ళీ పది కడవలు పోయాలి.

ఒక అయ్యదగ్గర పనికి కుదిరాక మరి తప్పదు గాక తప్పదు.

ఆకలి నడిపిస్తుంది. ఆకలి నోరు మూయిస్తుంది. ఆ ఆకలే నీళ్ళు మోయిస్తుంది.

సిన్నయ్య భుజం నీళ్ళ కడవలతో మంట కెత్తింది. అయినా తప్పని సరై మవునంగా మోశాడు.

"ఒరే, సిన్నా! నీ గిన్నె తెచ్చుకోరా ..." రెడ్డమ్మ కేక.

సిన్నయ్య సత్తుగిన్నె తెచ్చుకున్నాడు. ఆ గిన్నెలో ఇంత అన్నమూ, చారూ పోసింది. తను నిత్యం కూచుని తినే అరుగు క్రిందనే కూచున్నాడు.

అన్నం, చారూ రాత్రివే. అన్నం కొంత మెత్త బడింది. చారు సద్ది వాసన వేస్తోంది. ఆకలి ఏనాడో రుచిని జయించింది కాబట్టే సిన్నయ్య గబగబా తింటూనే ఉన్నాడు. అనుకోకుండా — తను మధ్యాహ్నం తినబోయే వేడి వేడి భోజనం కనుల ముందు మెదిలింది. ఆ వూహకే సిన్నయ్య మనసు ఆనందంతో పరవశించిపోయింది. ఆహా... వేడి వేడి భోజనం ...! నిజానికి ఎన్నెన్నో రోజుల తర్వాత... ఎప్పుడో రెడ్డిగారి ఇంట్లో పండుగలకు తప్ప లభించని అరుదైన అవకాశం—మళ్ళీ ఇన్నాళ్ళకూ... పైగా ఇక మీదట ప్రతి రోజూ ... అంతే!! ... ఆనందంతో ఇక ఆ పైన వూహించలేకపోయాడు.

"అబ్బా ..." రాయి సిన్నయ్య కాలికి ఎదురు దెబ్బ తగిలింది.

"ఏరా, సిన్నిగా ... ఏ టాలోసిత్తున్నావ్.... దార్చూసుక నడు ..."

సిన్నయ్య భుజం మార్చుకున్నాడు.

తలా ఆరు కడవల కాలువ నీళ్ళు మోశారు.

గంట గణగణ మ్రోగింది.

అంతసేపట్నుంచి కట్టేపడేసిన సంకెళ్ళు తెగినట్లయినాయి పిల్లలకు. ఆనందంతో కేరింతలు కొట్టారు. గుండెలు దడదడలాడించిన పంతుళ్ళు కబుర్లలో పడ్డారు. స్వేచ్ఛగా వూపిరులు పీల్చుకున్నారు పిల్లలు.

భోజనాల కార్యక్రమం మొదలయ్యింది.

పిల్లలు వరుసలు వరుసలుగా కూర్చున్నారు. దాదాపు అందరూ తమ తమ సొంత పళ్ళాలు తెచ్చుకున్నారు. సిన్నయ్య బృందం తమకు తెలియకుండానే చివరి వరుసలో చివరి వారుగానే కూర్చున్నారు. ఆ చిన్నారి మనసుల్లో నున్న ఆత్మన్యూనతాభావాన్ని పసిగట్టి — ముందుకు రమ్మని ఆదరించి, ఆహ్వానించిన ఆదర్శ ఉపాధ్యాయుడే కరువయ్యాడా బళ్ళో.

రెండవ తరగతి ఉపాధ్యాయుడు వడ్డిస్తున్నాడు.

"ఏరా మీ పళ్లేలు లేవూ? ... ఇక్కడ మీకోసం అరిటాకులు సిద్ధంచేసి విందు భోజనాలు వడ్డిస్తామని వచ్చార్రా ... వెళ్ళి ఆ విస్తర్లు తెచ్చుకోండి ఈ పూటకు... కదలండ్రా, వెధవల్లారా ..." కసిరాడు.

నలుగురూ జంకు జంకుగా విస్తర్లు తెచ్చుకున్నారు.

పంతులుగారు ఇతర చిన్న పిల్లలకు వడ్డించి నట్లుగానే కొద్ది కొద్దిగా వడ్డించారు. రామన్న చూపులకు ఆ అన్నం ఆనలేదు.

"ఇంకొంచం పెట్టండ్సా ...ర్!" అడక్కుండా ఉండలేక పోయాడు రామన్న.

ఆ అభ్యర్థనకు పంతులుగారు 'అదో రకంగా' చూశారు.

ఆ చూపుల్లోని భావాన్ని విడమర్చి చెప్పటానికి ఈ అక్షరాలకు శక్తి లేదు!

ఆ చూపుల ధాటికి నలుగరూ తమలో తాము కుంచించుకు పోయారు.

"ఆహా ... ఆకలితోటే వచ్చారుగా ...వూఁ లాగించండి .... లాగించండి ..." ఆ మాటల్లోని వ్యంగ్యం అర్థం చేసుకోలేనంతటి మూర్ఖులు కాదా పిల్లలు.

అన్నం పొగలు గ్రక్కుతోంది. ఆ పొగల్ని తన్మయంగా ఆస్వాదిస్తున్నాడు సిన్నయ్య. వేడి వేడి అన్నంలో వేడి వేడి సాంబారు వడ్డించారు. సాంబారు వాసనలు ప్రేగుల్లో దాగిన ఆకలిని రెచ్చగొడుతున్నాయి.

ఆనందంగా తినటం ప్రారంభించారు.

చాలా మంది పిల్లలు సరిగ్గా తినకుండానే వూరికే వేళ్ళతో అటూ ఇటూ కెలుకుతున్నారు. వారి ప్రవర్తన సిన్నయ్యకు ఎంతో ఆశ్చర్యం వేసింది. వారిని అట్టే గమనించకుండా తన భోజన కార్యక్రమం ప్రారంభించాడు.

"మళ్ళీ వడ్డించమంటా రేమిట్రా ..."

తల వూపకూడ దనుకుంటూనే తల వూపకుండా ఉండలేక పోయాడు సిన్నయ్య.

పంతులు పెద్ద పెట్టున నవ్వాడు. ఇతర పంతులూ, పిల్లలూ శ్రుతి కలిపారు.

పంతులు మళ్ళీ అన్నమూ, సాంబారూ వడ్డించాడు. సిన్నయ్య బృందం తలలు వంచుకుని తింటూనే ఉన్నారు.

మనసులో మాటలు గుచ్చుకుంటున్నా — కడుపులో రేగుతున్న ఆకలి మంటల ముందర మనసు మాట తప్పదు.

మిగతా పిల్లలు లేచారు — సిన్నయ్య బృందం తప్ప.

కడుపు నిండిన మనసు టీచర్ల చూపులు, మాటలు, నవ్వులు అన్నీ మరిచిపోయింది.

మళ్ళీ గంట గణగణ మ్రోగింది, బడిలోకి రమ్మంటూ.

● ● ● ●

నాలుగు గంటలలోపే బడి వదిలేశారు.

బోడి పలకతో నీరసంగా ఇంటికి వచ్చాడు సిన్నయ్య. మధ్యాహ్నం కొంత ఉత్సాహం కనిపించినా ... వాడికి ఎక్కడో ఏదో నొప్పి కలిగింది. అది కనిపించనిదీ ... ఇదీ అని చెప్పుకోను వీలుకానిదీ.

"ఏరా, సన్నిగా బడిడిసి పెట్టేంగ్రదాం ఎట్టాగుందిరా బడి." ఆత్రతతో అడిగింది ముత్తెమ్మ.

"బాగానే ఉండాదమ్మా." నీరసంగా జవాబిచ్చాడు సిన్నయ్య.

"ఏటి నేరుసుకున్నవ్‌రా ఇయ్యాల?"

బోడి పలకమీద ఆ అలు చూపించాడు. అవి ఏమిటో ఆ తల్లికి తెలియక పోయినా, కొడుకు ఏవో నేర్చుకుంటున్నందుకు ఆనంద మేసింది.

మధ్యాహ్నం భోజనాల తరవాత నేల బెంచీలమీద పూరికే కూర్చోవటం సిన్నయ్యకు దుర్భర మయింది. అది అర్ధ కష్టంతో నయినా కాలవ గట్టుమీద చింతచెట్టు కింద మూగన్నుగా. నిద్రలోకి జారే వేళ. మ రీ వేళ కడుపు పూర్తిగా నిండింది కదా! కానీ నిద్రకు అవకాశమేది?

"ఆరేసిన్నా. పేడేసు కొద్దాం పద. పసుల మంద లొచ్చే యాలయ్యింది." ఇష్టం లేకున్నా, విసుగా ఉన్నా గంప తీసుకుని తల్లి వెనకాల పోక తప్పింది కాదు సిన్నయ్యకు.


చీకటి పడింది. ఒళ్ళంతా పచ్చి పుండులా ఉంది. మనసూ, శరీరమూ రెండూ అలిసి పోయి ఉన్నాయి. అయినా మళ్ళీ కడుపులో ఆకలి కరకర లాడుతూనే ఉంది. నేను నీతో ఉన్నానంటూ. ముత్తెమ్మ తను కూచుని సిన్నయ్యను భోజనానికి పిలిచింది.

సిన్నయ్య ఆకలి మీద తల్లి గిన్నెలోని అన్నం గబగబా తింటున్నాడు.

ముత్తెమ్మలోని తల్లి మనసు కొడుకు ఆకలిని గ్రహించింది. తను నెమ్మదిగా ఒక్కో ముద్ద తింటూంది. సిన్నయ్య కది గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు. తల్లి కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"నీవు తిన్నా, సిన్నా. నేను మళ్ళీ కుండలో కూడుం దది పెట్టుకుంటాలే."

సిన్నయ్య తల వంచుకుని తిన్నాడు. ఆకలి తీరి




పట్లయింది.

తిని, చేతి కందుబాటులో నున్న కుండందు వ్వాడు తల్లి కందించడానికి. కుండ తేలిగ్గా ఉంది మూత తీశాడు అనుమానంగా.

ఖాళీ!

ఖాళీ కుండ సిన్నయ్యను వెక్కిరించి నట్లయింది.

సిన్నయ్య చిన్నారి మనసులో మాటల కందని ఏదో బాధ.

తల్లి ముఖంలోకి సూటిగా చూడలేక బయటి కెళ్ళి కుక్కి మంచంలో పడుకున్నాడు. మానసికంగా శారీరకంగా ఎంతో అలిసినా సిన్నయ్యకు ఎంతకూ నిద్ర పట్టలేదు. ఆ చిన్నారి మనసులో ఎన్నెన్నో ఆలోచనలు.

ఆ రాత్రి సిన్నయ్యకు నిద్ర రాలేదు.

● ● ● ●

వారం రోజులు గడిచాయి.

సిన్నయ్య మానసికంగా, శారీరకంగా దినదినానికీ అలిసి పోతున్నాడు.

మలికోడి కూతతో దినచర్య మొదలు.

ఎముకల్ని కొరికే చలిలో, పశువుల పాకలో పేడ, కసువులతో రెక్కలు ముక్కలు చేసుకోవాలి.

రెడ్డిగారు, రెడ్డెమ్మ, పెద్ద జీతగాళ్ళు, బడి కెల్లని పిల్ల జీతగాళ్ళ మాటిపోటి విసుర్లు. వీటికి దూరంగా పని మానేద్దామంటే...ఆకలి. తెల్లవారి పొద్దెక్కిన దగ్గర నుంచి జానెడు కడుపులో చండ ప్రచండంగా ఆకలి. కన్నవారు తీర్చలేని కటిక ఆకలి.

ఇక బడిలో చూపులతో, మాటలతో, ఈసడింపు లతో, ఎత్తిపొడుపులతో గుండెల్లోకి మెత్తని బాకులు దించే మన పెరగని ఉపాధ్యాయులు మమత లెరుగని మాస్టర్లు.

నలిగిన, చిరిగిన బట్టల్ని కించ పరిచే ఖరీదైన బట్టల పిల్లలు.

మళ్ళీ వంట పేరుతో శరీరశ్రమ కొల్లగొడుతున్న 'వింత వాతావరణం.'

ఆకలి కడుపుల మీద అడ్డమైన జోకులు చెప్పుకుని నవ్వుకుంటూ ఆన్నానికి బదులు హేళనాహేళ న్నందిస్తున్న కుళ్ళు వాతావరణం.

సాయంకాలం.

నీరసాన్ని మోసుకుంటూ తల్లితో పాటు పశువుల పేడ కోసం నిరంతరాన్వేషణ.

రాత్రి, పగలంతా రెక్కలు ముక్కలు చేసుకున్న తల్లికి ఆకలి మిగల్చలేక మధ్యాహ్నం కడుపు నింపు కున్న తాను అర్ధాకలిని కప్పుక పడుకోవటం.

ఈ దినవారీ మానసిక, శారీరక హింసతో సిన్నయ్య నలిగి నలిగి పొయ్యాడు.

పదిహేను రోజుల తరవాత సిన్నయ్య మళ్ళీ 'విముక్తిని' మనసారా కోరుకున్నాడు.

సిన్నయ్య బృందం అప్పటికి రెండు రోజుల ముందే విముక్తిని పొందిందికూడా.

● ● ● ●

దుమ్ము. దుమ్ము. దుమ్ము...

పశువులు. ఆవులు. పేడ. కాల్వగట్లు. బీడు నేలలు. చింతల నీడలు.

జీవితం మళ్ళీ గాడిలో పడింది.

శారీరక హింసను మించిన మానసిక హింసా ప్రవక్తి లేనప్పుడు.

శ్రమ. శ్రమ—శ్రమ. అయినా అలవాటయిన శ్రమే.

ఒక రోజు చింతచెట్టు నీడన చేరి రామిగాడన్నాడు:

"ఒరోరే! మన్లాటోళ్ళు సదుంకోవాలంటే. ఒంటి పూట మాత్తరమే తిండెడితే కుదర్దురా. మూడు పొద్దులా పెట్టాల్సిందేరా యేటంటవురా సిన్నగా."

సిన్నయ్య అవునని తలూపాడు.

ఏమర్థమయిందో ఏమో చుక్క గేదకూడా అలాగే నన్నట్లుగా తలకాడించింది.

పట్నంనుంచి బడికి పెచ్చాలు తెస్తున్న లారీ దుమ్ము లేపుకుంటూ రోడ్డు దిగింది.

ఎందుకో మరి సిన్నయ్య ఎగతాళిగా ఈల వేశాడు లారీ కేసి చూస్తూ. ●